సాక్షి
కామారెడ్డి

మంగళవారం 29 అక్టోబర్ 2024



ఫిర్యాదులు పరిష్కరించాలి

ప్రజావాణిలో నమోదయ్యే ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు.

- 10లో ▸



డిమాండ్లను నెరవేర్చాలి

తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరారు.

- 11లో ▸

గరిష్టం/కనిష్టం
37.2 /17.9

వాతావరణం

ఉదయం ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది. మంచు కురుస్తుంది. చలి తీవ్రత పెరిగే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్‌గా విక్టర్ నియామకం

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్‌గా వి.విక్టర్‌ను నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. హెచ్ఎండీఏలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న విక్టర్‌కు కామారెడ్డి అదనపు కలెక్టర్‌గా పోస్టింగ్ ఇచ్చింది. ఇక్కడ అదనపు కలెక్టర్‌గా పనిచేసిన చంద్రమోహన్ నాలుగు నెలల క్రితం రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పీఎస్‌గా వెళ్లిన విషయం తెలిసిందే. అప్పటినుంచి ఇన్‌చార్జి బాధ్యతలను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి చూస్తున్నారు. నూతన అదనపు కలెక్టర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

నిజామాబాద్ కార్పొరేషన్ కమిషనర్ మకరందు బదిలీ

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మంద మకరందును బదిలీ చేస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. మకరందు సీసీఎల్ఏ ప్రాజెక్టు డైరెక్టర్(పీడీ)గా నియమితులయ్యారు. ఆయన స్థానంలో మేడ్చల్ జెడ్పీ సీఈవోగా పనిచేస్తున్న ఎస్.దిలీప్ కుమార్‌ను నియమించారు. నూతన కమిషనర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

3న శ్రీరామరాజ్య స్థాపన న్యాస్ సమావేశం

కామారెడ్డి అర్బన్ : శ్రీరామరాజ్య స్థాపన న్యాస్ దక్షిణ భారత్ విభాగ్ సమావేశాన్ని వచ్చేనెల 3వ తేదీన కామారెడ్డిలో నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని శ్రీరామ్‌లల్లా క్షేత్ర కామారెడ్డి కార్యదర్శి ఎస్‌హెచ్ ఫులారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చేనెల 3న ఉదయం 9గంటలకు జిల్లాకేంద్రంలోని కళాభారతి ఆడిటోరియంలో సమావేశం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. శ్రీరామ్‌లల్లా క్షేత్రాలకు సంబంధించిన దక్షిణ భారతదేశ ప్రతినిధులు, స్వామీజీలు, స్థానిక ప్రతినిధులు సమావేశంలో పాల్గొంటారని తెలిపారు.

విచారణకు ఆదేశం

కామారెడ్డి టౌన్: తమపై దాడి చేసినవారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గాంధారికి చెందిన ఓ కుటుంబం ముఖ్యమంత్రి కార్యాలయంలో ఈనెల 26న ఫిర్యాదు చేయగా.. ఈ ఘటనపై విచారణ జరపాలని సోమవారం జిల్లా అధికారులకు సీఎంవో నుంచి ఆదేశాలు వచ్చాయి. ఓ వ్యక్తి 50 మందిని తీసుకుని వచ్చి తన గుడిసెను, రేకులను ధ్వంసం చేశాడని సీఎంవోలో ఫిర్యాదు చేశానని గాంధారికి చెందిన ఎరుకల పెద్ద సాయిలు తెలిపాడు. విచారణ జరిపి న్యాయం చేయాలని కోరాడు.


కొవ్వొత్తుల ర్యాలీ



ఖలీల్‌వాడి(నిజామాబాద్ అర్బన్): పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని (పోలీసు ఫ్లాగ్ డే) పురస్కరించుకొని ఇన్‌చార్జి సీపీ సింధుశర్మ ఆదేశాల మేరకు డీసీపీ(అడ్మిన్) కోటేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఎల్ఐసీ చౌరస్తా నుంచి ప్రారంభమైన ర్యాలీ మున్సిపల్ కార్యాలయం, ఎన్టీఆర్ చౌరస్తా, పోలీస్ హెడ్ క్వార్టర్స్ వరకు కొనసాగింది. కార్యక్రమంలో డీసీపీ(ఏఆర్) శంకర్‌నాయక్, ట్రాఫిక్ ఏసీపీ నారాయణ, ఆర్మ్‌డ్ రిజర్వ్ ఏసీపీ నాగయ్య, టౌన్ సీఐ శ్రీనివాస్ రాజ్, రిజర్వ్ సీఐలు సతీశ్‌కుమార్, తిరుపతి, శ్రీనివాస్, ఎస్‌బీ సీఐ ప్రసాద్, సీఐలు, ఎస్సైలు, స్పెషల్ పార్టీ సిబ్బంది, అమరవీరుల కుటుంబాల సభ్యులు పాల్గొన్నారు.

కలవని కరములు!

- కొత్త, పాత నేతల మధ్య కుదరని సయోధ్య
- అధికార పార్టీలో లీడర్లే కాదు.. క్యాడర్‌లోనూ విభేదాలు
- అన్ని నియోజకవర్గాల్లోనూ ఇదే పరిస్థితి



అధికార కాంగ్రెస్ పార్టీలో గ్రూపు తగాదాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. పాత, కొత్త నేతల మధ్య పొసగడం లేదు. ముఖ్య నేతలు సైతం వారిని కలిపే ప్రయత్నం చేయడం లేదు. దీంతో నేతలతోపాటు క్యాడర్ మధ్య కూడా ఆధిపత్య పోరు తారస్థాయికి చేరుకుంటోంది. జిల్లా అంతటా ఇదే పరిస్థితి నెలకొంది.

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లా కాంగ్రెస్ పార్టీలో వర్గ పోరు ఎక్కువయ్యింది. ఏ నియోజకవర్గంలో చూసినా గ్రూప్ విభేదాలు రచ్చకెక్కుతున్నాయి. పార్టీ, నామినేటెడ్ పదవులు, ఇందిరమ్మ కమిటీల విషయంలో చాలా చోట్ల నేతల్లో అసంతృప్తి బయటపడుతోంది. తమకు అవకాశాలు రాకపోవడానికి పార్టీలోని ప్రత్యర్థులే కారణమంటూ విమర్శలు చేసుకుంటున్నారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో కొత్త, పాత నేతల మధ్య నెలకొన్న విభేదాలు, ఆధిపత్య ధోరణిని సరిచేసే ప్రయత్నాలు జరగడం లేదు.

బాన్సువాడ ఎవరి అడ్డా?

బాన్సువాడ నియోజక వర్గంలో మొదటి నుంచి కాంగ్రెస్‌ను అంటిపెట్టుకుని ఉన్న కాసుల బాల్‌రాజుకు అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్టు దక్కలేదు. ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి అక్కడి నుంచి పోటీ చేశారు. దీనిని జీర్ణించుకోలేక బాల్‌రాజు ఆత్మహత్యాయత్నం కూడా చేశారు. అయితే రవీందర్‌రెడ్డి తన పని తాను చేసుకుంటూ బీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలో ఉన్న పోచారం శ్రీనివాస్‌రెడ్డితో తలపడ్డారు. హోరాహోరీ పోరులో పోచారం గెలిచారు. రవీందర్‌రెడ్డి ఓడినప్పటికీ నియోజకవర్గాన్ని అంటిపెట్టుకుని ఉంటూ క్యాడర్‌ను బలోపేతం చేశారు. పోచారంపై అసంతృప్తితో ఉన్న, పోచారంను వ్యతిరేకించిన నేతలందరినీ కూడగట్టుకుని బలమైన క్యాడర్‌ను తయారు చేసుకున్నారు. అయితే పోచారం శ్రీనివాస్‌రెడ్డి బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరడంతో అయోమయ పరిస్థితి నెలకొంది. ఇదే సమయంలో కాసుల బాల్‌రాజు, పోచారం ఒక్కటవడం ఏనుగు వర్గానికి ఇబ్బందికరంగా మారింది. నియోజకవర్గం అంతటా కాంగ్రెస్ శ్రేణులు రెండుగా చీలిపోయాయి. నామినేటెడ్ పదవుల విషయంలో ఏనుగు వర్గానికి అవకాశాలు రావడం లేదు. దీంతో ఆయన అనుచరులంతా గుర్రుగా ఉన్నారు. ఇందిరమ్మ కమిటీల విషయంలోనూ ఇరువర్గాలు పోటాపోటీగా ప్రతిపాదనలు ఇస్తుండడం పార్టీకి తలనొప్పిగా మారింది. నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న ఏనుగు రవీందర్‌రెడ్డి మాట చెల్లుబాటు కావాలా? ఎమ్మెల్యేగా ఉన్న పోచారం మాటకు గౌరవం ఇవ్వాలా? అన్నదానిపై నేతలు తలపట్టుకునే పరిస్థితి ఏర్పడింది.

జుక్కల్‌లోనూ..

జుక్కల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీలోనూ గ్రూప్ తగాదాలు పెరుగుతున్నాయి. ఇక్కడ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు ఆధిపత్యం కొనసాగుతోంది. మార్కెట్ కమిటీ చైర్మన్‌ల నియామకం విషయంలో తమకు ప్రాధాన్యత ఇవ్వడం లేదంటూ ఓ వర్గం నేతలు ఎమ్మెల్యేపై అసంతృప్తితో ఉన్నారు. పార్టీని అంటిపెట్టుకుని ఉన్న తమకు కాకుండా ఇతరులకు ప్రాధాన్యత ఇస్తున్నారన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. జుక్కల్ నియోజకవర్గంలో ఇతర నియోజకవర్గాలకు చెందిన ముఖ్య నేతలు వేలు పెడుతుండడంతో ఎమ్మెల్యేకు వ్యతిరేక గ్రూపు ఒకటి జీవం పోసుకుంటోందని తెలుస్తోంది.

కామారెడ్డిలో కొత్త, పాత భావన..

కామారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ నేతల్లో కొత్త, పాత అన్న భావన పెరుగుతోంది. కొత్తగా పార్టీలోకి వచ్చిన వారి పెత్తనం నడుస్తోందంటూ పలువురు సీనియర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ అందరినీ కలుపుకుని వెళ్లే ప్రయత్నం చేస్తుండగా, పాత క్యాడర్ మాత్రం తమకు ప్రాధాన్యత దొరకడం లేదన్న భావనతో ఉంది. అప్పట్లో బీఆర్ఎస్ పార్టీలో ఉండి తమపై పెత్తనం చేసిన వారంతా ఇప్పుడు కాంగ్రెస్ కండువా కప్పుకుని ఇక్కడా అలాగే చేస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు వస్తే టికెట్ల కేటాయింపు సమస్యగా మారనుంది. పాత వారికి టికెట్లు ఇవ్వకుంటే తిరుగుబాటు చేసే అవకాశాలున్నాయి.

ఎల్లారెడ్డిలో రెండు వర్గాల మధ్య..

ఎల్లారెడ్డి నియోజకవర్గం టికెట్టును మదన్‌మోహన్‌రావుతోపాటు సుభాష్‌రెడ్డి ఆశించారు. అయితే అధిష్టానం మదన్‌మోహన్‌రావుకే టికెట్టు ఇవ్వడంతో సుభాష్‌రెడ్డి పార్టీని వీడి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. తర్వాత తిరిగి సొంత గూటికి వచ్చారు. అయితే నియోజకవర్గంలో ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు చెప్పిందే నడుస్తుండడంతో సుభాష్‌రెడ్డి అనుచరుల్లో అసంతృప్తి పెరుగుతోంది. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీకి ఎల్లారెడ్డి నియోజకవర్గంతో అనుబంధం ఉండడంతో సుభాష్‌రెడ్డి వర్గీయులంతా షబ్బీర్‌అలీతో సన్నిహితంగా ఉంటున్నారు. ఇటీవల ఎల్లారెడ్డి పట్టణంలో సుభాష్‌రెడ్డి వర్గీయులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో షబ్బీర్ అలీ ఫొటో ఉండడం, అందులో ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ఫొటో లేకపోవడంతో ఎమ్మెల్యే అనుచరులు ఆ ఫ్లెక్సీని తొలగించారు. దీంతో విభేదాలు మరింత పెరిగాయి. రామారెడ్డి మండలానికి చెందిన మాజీ జెడ్పీటీసీ మోహన్‌రెడ్డి, పార్టీ సీనియర్ నేత మహేందర్‌రెడ్డి తదితరులు ఎమ్మెల్యేపై అప్పట్లో తిరుగుబాటు చేశారు. ఎమ్మెల్యే పీఏల పెత్తనం ఏంటని విమర్శలు ఎక్కుపెట్టారు. ఆ వివాదం ఇప్పటికీ సమసిపోలేదు. సుభాష్‌రెడ్డి వర్గానికి నామినేటెడ్ పదవులతోపాటు పార్టీ మండల కమిటీలలోనూ అవకాశాలు దక్కడం లేదు. దీంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ పరిస్థితి ఏమిటన్న దానిపై సుభాష్‌రెడ్డి అనుచరులు ఆందోళనలో ఉన్నారు.



రైతుపోరు యాత్రలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ బీబీ పాటిల్

ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

- ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలి
- మాజీ ఎంపీ బీబీ పాటిల్ డిమాండ్

నాగిరెడ్డిపేట: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని బీజేపీ జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ బీబీ పాటిల్ డిమాండ్ చేశారు. నాగిరెడ్డిపేట మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన రైతుపోరు యాత్రలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలలో కాంటాలు ప్రారంభించకపోవడంతో ధాన్యం రాశులు పేరుకుపోతున్నాయన్నారు. వెంటనే కాంటాలు ప్రారంభించాలన్నారు. అన్ని రకాల వడ్లకు క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎలాంటి షరతులు లేకుండా రూ. 2 లక్షలలోపు పంట రుణాలను మాఫీ చేయాలని, రైతుభరోసా నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రైతుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. అనంతరం ఆయన రైతులతో కలిసి తహసీల్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి, తహసీల్దార్ శ్రీనివాస్‌రావుకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సంపత్‌రావు, ఎల్లారెడ్డి అసెంబ్లీ కన్వీనర్ లింగారావు, జిల్లా కార్యవర్గ సభ్యులు రాజ్‌మోహన్‌రెడ్డి, హన్మాండ్లు, బీజేపీ మండలాధ్యక్షుడు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కాంటాలు ప్రారంభించండి

ఎల్లారెడ్డి: ధాన్యం కొనుగోలు కేంద్రాలలో వెంటనే కాంటాలు ప్రారంభించాలని జహీరాబాద్ మాజీ ఎంపీ బీబీ పాటిల్ కోరారు. సోమవారం ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోళ్లను ప్రారంభించకపోవడంతో కొనుగోలు కేంద్రాల వద్ద కుప్పల కొద్దీ ధాన్యం రాశులు పేరుకుపోతున్నాయన్నారు. కొనుగోళ్లను ప్రారంభించి రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాజ్‌మోహన్‌రెడ్డి, నర్సింలు పాల్గొన్నారు.



ఆర్డీవోకు వినతి పత్రం ఇస్తున్న బీబీ పాటిల్

గంధం చెట్ల నరికివేత

- దుంగలను ఎత్తుకెళ్లిన దొంగలు
- దేమికలాన్ శివారులో ఘటన

తాడ్వాయి: దేమికలాన్ శివారులోని గంధం చెట్లను ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నరికివేసి దుంగలను ఎత్తుకెళ్లారు. వివరాలిలా ఉన్నాయి. తాడ్వాయికి చెందిన శ్రీకాంత్‌రెడ్డి కొన్నేళ్లుగా పొలం వద్ద గంధం చెట్లను పెంచుతున్నాడు. ఏపుగా పెరిగిన చెట్లను ఆదివారం రాత్రి దుండగులు కోసి, దుంగలను తీసుకువెళ్లారు. సుమారు 60 వేల వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపారు. గతేడాది కూడా గుర్తు తెలియని వ్యక్తులు తన పొలంలోంచి గంధం చెట్లను నరికి దుంగలను ఎత్తుకువెళ్లారన్నారు. దొంగలు మూడు నెలల క్రితం ఎండ్రియాల్‌లో లక్ష రూపాయల విలువైన గంధం చెట్లను నరికి తీసుకువెళ్లిన విషయం తెలిసిందే. దొంగలను పట్టుకుని న్యాయం చేయాలని కోరుతున్నారు.



గంధం చెట్టును నరికివేసిన దృశ్యం

నేడు ప్రజాభిప్రాయ సేకరణ

నిజామాబాద్అర్బన్ : రాష్ట్రంలో స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన రిజర్వేషన్ల దామాషాపై ఆయా రాజకీయ పార్టీలు, సంఘాలు, ప్రజల అభిప్రాయాలను సేకరించేందుకు తెలంగాణ బీసీ కమిషన్ సభ్యుల బృందం మంగళవారం నిజామాబాద్‌కు రానుంది. ఈ విషయాన్ని నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాకు సంబంధించి నిజామాబాద్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)లో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కమిషన్ చైర్మన్ నిరంజన్ నేతృత్వంలో బృందం ప్రజాభిప్రాయాలను సేకరించనున్నట్లు తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిజామాబాద్ జిల్లాకు చెందిన వారు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కామారెడ్డి జిల్లాకు చెందిన వారు తమ అభిప్రాయాలను తెలియజేయొచ్చని సూచించారు. నిర్దేశిత నమూనాలో వెరిఫికేషన్ అఫిడవిట్‌తోపాటు ఆరు సెట్లను తెలుగు లేదా ఆంగ్ల భాషలో ఇవ్వాల్సి ఉంటుందని, వాదనలకు మద్దతుగా తమ వద్ద ఉన్న సమాచారం, మెటీరియల్, సాక్ష్యాలను, సంబంధిత కేసుల వివరాలను పేర్కొంటూ, సమర్పణలు, అభ్యర్థనలు, సలహాలు, ఆక్షేపణలను కమిషన్‌కు నివేదించాలన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ కోసం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

ఆర్థోపెడిక్ సర్జన్ అసోసియేషన్ సమావేశం



సమావేశంలో పాల్గొన్న ఆర్థోపెడిక్ సర్జన్ అసోసియేషన్ సభ్యులు

కామారెడ్డి టౌన్ : తెలంగాణ రాష్ట్ర ఆర్థోపెడిక్ సర్జన్ అసోసియేషన్(టీవోఎస్ఏ) రాష్ట్ర సమావేశాన్ని సోమవారం జిల్లా కేంద్రంలోని సమన్య ప్యాలెస్‌లో నిర్వహించారు. రాష్ట్రంలోని 482 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా టీవీవీపీ కమిషనర్ అజయ్‌కుమార్ హాజరయ్యారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు బన్సీలాల్, ప్రవీణ్, చంద్రశేఖర్‌రెడ్డి, కాశ శ్రీనివాస్, మధుసూదన్, భానుతేజ, నాగార్జున్ తదితరులు పాల్గొన్నారు.

‘లింగ నిర్ధారణ’ ఒక పెద్ద రాకెట్

- వైద్యశాఖ సహకారంతో కట్టడికి చర్యలు తీసుకుంటున్నాం
- ఎస్పీ సింధు శర్మ



కామారెడ్డి క్రైం : లింగ నిర్ధారణ పరీక్షల కేసు ఒక పెద్ద రాకెట్ లాంటిదని ఎస్పీ సింధు శర్మ పేర్కొన్నారు. వైద్య శాఖ అధికారుల సహకారంతో కేసు విచారణ కొనసాగుతోందన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమ వారం ఆమె విలేకరులతో మాట్లాడారు. కొద్దిరోజు ల క్రితం జిల్లాకేంద్రంలోని సమన్విత ఆస్పత్రిలో లింగ నిర్ధారణ పరీక్షలు, అప్పుడే పుట్టిన పాప విక్రయంపై కేసులు నమోదయ్యాయన్నారు. పది రోజు ల క్రితం రాజంపేట ఠాణా పరిధిలో లింగ నిర్ధారణ చేస్తున్న రవి అనే యువకుడిని పట్టుకుని, స్కానింగ్ మిషన్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆయా ఘటనలతో పోలీసు శాఖ అప్రమత్తమైందన్నారు. రాజంపేట కేసులో అక్రమంగా లింగ నిర్ధారణ చేస్తున్నట్లుగా గుర్తించిన రవి అనే వ్యక్తితో పాటు 15 మంది ఆర్ఎంపీలపైనా కేసులు నమోదు చేశామన్నారు. లింగ నిర్ధారణ రాకెట్‌పై ప్రత్యేక దృష్టి సా రించి సీసీఎస్ సీఐ శ్రీనివాస్, కామారెడ్డి టౌన్, భి క్కనూరు సీఐలు చంద్రశేఖర్‌రెడ్డి, సంపత్ కుమార్, రాజంపేట ఎస్సై పుష్పరాజ్‌లతో ప్రత్యేక బృందా న్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రత్యేక నిఘా పె ట్టడంతో నాలుగు రోజుల క్రితం ఓ కారులో అక్ర మంగా తరలిస్తున్న రెండు స్కానింగ్ మిషన్‌లను ప ట్టుకోగలిగామన్నారు. దొరికిన యూఎస్‌డీ స్కానింగ్ మిషన్‌లలో ఒకటి గతంలో సీజ్ చేసిన కౌసల్య ఆస్పత్రి పేరు మీద, మరొకటి రాజంపేటలోని ఓ ఆస్పత్రి పేరు మీద ఉన్నాయని పేర్కొన్నారు. వాటిని కొనుగోలు చేసినప్పుడు నమోదు చేయబడిన వైద్యుడు సంబంధిత ఆస్పత్రిలోనే నిబంధనల ప్రకారం మాత్రమే వాడాల్సి ఉంటుందన్నారు. మరొకరు వాడడం మరో చోటుకు తరలించడం నేరమన్నారు. ఇప్పటి వరకు వెలుగు చూసిన లింగ నిర్ధారణ ఘటనల్లో పీసీపీఎన్‌డీటీ యాక్టు కింద కేసులు నమోదు చేశామన్నారు. లింగ నిర్ధారణ రాకెట్‌ను పూర్తి స్థాయిలో కట్టడి చేసేందుకు కృషి చేస్తామన్నారు.

వైద్యారోగ్యశాఖ అధికారులపై మంత్రి ఆగ్రహం!

కామారెడ్డి టౌన్: జిల్లాలో వరుసగా వెలుగు చూస్తున్న లింగ నిర్ధారణ కేసులకు సంబంధించిన వ్యవహారంపై వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆరా తీశారు. సోమవారం సాయంత్రం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. జరిగిన ఘటనలు, కేసులకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. ఈ వ్యవహారం ఎన్నో ఏళ్లుగా జరుగుతున్నా ఇంతకాలంగా ఏం చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈ కేసులకు సంబంధించి కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు సమాచారం. తాజా పరిణామాలపై కలెక్టర్ అధికారులతో సమీక్షించినట్లు తెలిసింది.

విచారణ కొనసాగుతోంది

- నిందితులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం
- డీఎంహెచ్‌వో చంద్రశేఖర్



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో చంద్రశేఖర్

కామారెడ్డి టౌన్ : జిల్లాలో లింగ నిర్ధారణ పరీక్షల నిర్వహణకు సంబంధించిన కేసులపై విచారణ కొనసాగుతోందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడారు. ఈ నెల 25న అల్ట్రా సౌండ్ స్కానింగ్ మిషన్లను సీజ్ చేసిన ఘటనలో ఎలాంటి అర్హత లేని ఇట్టం నడిపి సిద్ధిరాములు, అతడి దగ్గర పని చేసే దేవుని పృథ్వీలపై పీసీపీఎన్‌డీటీ చట్ట ప్రకారం కేసులు నమోదు చేశామన్నారు. సీజ్ చేసిన యంత్రాల్లో ఒకటి 2011లో రాజంపేట ఆస్పత్రి పేరు మీద రిజిస్ట్రేషన్ అయి ఉందన్నారు. మరో యంత్రం రిజిస్ట్రేషన్ పత్రాలు లేవని, అది ఎవరి పేరున ఉందో విచారణ చేస్తున్నామని తెలిపారు. లైసెన్స్ ఉన్నవారు మాత్రమే ఈ యంత్రాలను వినియోగించాలని చెప్పారు. వీరిపైనే ఇప్పటి వరకు మూడుసార్లు దాడులు చేసి ఆస్పత్రులను సీజ్ చేశామని పేర్కొన్నారు. హైకోర్టు నుంచి స్టే తెచ్చుకుని తిరిగి దందా నడిపిస్తున్నారన్నారు. ప్రజల్లో అవగాహన వస్తే తప్ప లింగ నిర్ధారణ పరీక్షలను కట్టడి చేయలేమన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. జిల్లాలో లింగ నిర్ధారణ పరీక్షలకు సంబంధించిన ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. లింగ నిర్ధారణను చేయించుకోవడానికి వచ్చిన వారిని సైతం విచారణ చేస్తున్నామని, త్వరలోనే పూర్తి వివరాలను వెల్లడిస్తామని పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. సమావేశంలో రాష్ట్ర పీసీపీఎన్‌డీటీ ప్రోగ్రాం అధికారి సుమిత్ర నాయర్, డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ప్రభుదయాకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ వైస్ చైర్మన్‌గా చంద్రశేఖర్‌రెడ్డి ఎన్నిక

- అభినందనలు తెలిపిన చైర్మన్ రమేష్‌రెడ్డి, డైరెక్టర్లు..



సుభాష్‌నగర్ : జిల్లా సహకార కేంద్ర బ్యాంకు వైస్ చైర్మన్‌గా బోర్గాం(పి) సొసైటీ చైర్మన్ నల్ల చంద్రశేఖర్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం ఎన్‌డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ఎన్నికల్లో నల్ల చంద్రశేఖర్‌రెడ్డి ఒక్కరే నామినేషన్ దాఖలు చేశారు. దీంతో ఎన్నికల అధికారిగా వ్యవహరించిన కామారెడ్డి డీసీవో రామ్మోహన్ వైస్ చైర్మన్‌గా ఎన్నికైనట్లు చంద్రశేఖర్ రెడ్డికి నియామకపత్రం అందజేశారు. పది రోజుల క్రితం ఎన్నిక ప్రక్రియ చేపట్టినప్పటికీ నామినేషన్ దాఖలు కాకపోవడంతో వాయిదా పడిన విషయం తెలిసిందే. వైస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన చంద్రశేఖర్‌రెడ్డికి చైర్మన్ కుంట రమేష్‌రెడ్డి, సీఈవో నాగభూషణం వందే, డైరెక్టర్లు గొర్కంటి లింగం, గిర్దావర్ గంగారెడ్డి, శరత్‌తోపాటు మోపాల్ మండల నాయకు లు, సీఈవోల అసోసియేషన్ ప్రతినిధులు, బ్యాంకు అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు.



చంద్రశేఖర్‌రెడ్డిని అభినందిస్తున్న చైర్మన్

ఏడు నెలలుగా ఖాళీగా..

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డిపై వైస్ చైర్మన్ కుంట రమేష్‌రెడ్డి సహా డైరెక్టర్లు అవిశ్వాసం పెట్టారు. అవిశ్వాసం నెగ్గడంతో వైస్ చైర్మన్‌కు ఇన్‌చార్జి చైర్మన్ బాధ్యతలు అప్పగించారు. ఆ తర్వాత చైర్మన్ పదవికి ఎన్నిక జరగగా, కుంట రమేష్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అప్పటి నుంచి వైస్ చైర్మన్ పదవి ఖాళీగా ఉంది. ఏడు నెలల తర్వాత వైస్ చైర్మన్ పదవికి ఎన్నికలు జరిగాయి.

రెండు పదవులూ నిజామాబాద్ జిల్లాకే..

బోర్గాం(పి) గ్రామానికి చెందిన నల్ల చంద్రశేఖర్‌రెడ్డి గత మూడు పర్యాయాలు సొసైటీ చైర్మన్‌గా ఎన్నికవుతున్నారు. ఈ పాలకవర్గంలో డీసీసీబీ డైరెక్టర్‌గా ఎన్నిక కాగా, తాజాగా వైస్ చైర్మన్‌గా అవకాశం దక్కింది. వైస్ చైర్మన్ పదవిని కామారెడ్డి జిల్లాకు కేటాయించాలని డిమాండ్ చేసినప్పటికీ.. సరైన బలం లేకపోవడంతో నల్ల చంద్రశేఖర్‌రెడ్డిని పదవి వరించింది. దీంతో డీసీసీబీ చైర్మన్, వైస్ చైర్మన్ పదవులు నిజామాబాద్ జిల్లాకే దక్కాయి.

క్లుప్తంగా

అందమైన గిజిగాడి గూడు



మద్నూర్(జుక్కల్): గిజిగాడు పక్షుల గూళ్లు చూడటానికి ఎంతో అందంగా ఉంటాయి. గూడు నిర్మాణంలో గిజిగాడికి సాటిరారెవరు. గిజిగాడు గడ్డి పోచలతో కట్టుకునే గూడు నిర్మాణం మానవుడికి కూడా సాధ్యం కాదేమో అనిపిస్తుంది. మండలంలోని కుర్లా గ్రామ శివారులో చెట్టుకు గిజిగాడి కట్టిన గూళ్లు పలువురిని ఆకట్టుకుంటున్నాయి.

కమలాకర్‌కు ఉత్తమ సేవా అవార్డు ప్రదానం



సుభాష్‌నగర్: నగరంలోని డి–5 సెక్షన్ అసిస్టెంట్ లైన్‌మన్ కమలాకర్‌కు సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన బహుజన సాహిత్య అకాడమీ 8వ వార్షికోత్సవంలో ఉత్తమ సేవా అవార్డును జాతీయ అధ్యక్షుడు రాధాకృష్ణ ప్రదానం చేశారు. జాతీయస్థాయిలో కమలాకర్‌కు ఉత్త మ సేవా అవార్డు రావడంపై ఏడీఈ (కన్‌స్ట్రక్షన్) తోట రాజశేఖర్, టౌన్–2 ఏడీఈ ప్రసాద్‌రెడ్డి, ఏఈ అజారుద్దీన్, నగేశ్ సిబ్బంది అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో అకాడమీ తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు నాగరాజు పాల్గొన్నారు.

ప్రజావాణికి 65 ఫిర్యాదులు

నిజామాబాద్‌అర్బన్: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 65 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, డీఆర్డీవో సాయాగౌడ్, ఇన్‌చార్జి డీపీవో శ్రీనివాస్, నిజామాబాద్ ఏసీపీ రాజావెంకట్‌రెడ్డిలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన చేసి సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్
- ప్రజావాణికి 64 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి మొత్తం 64 ఫిర్యాదులు వచ్చాయి. వాటిలో 27 రెవెన్యూ, 9 వ్యవసాయ, 10 జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయానికి సంబంధించినవి కాగా మిగితావి వివిధ శాఖలకు చెందిన ఫిర్యాదులు నమోదయ్యాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను సంబంధిత అధికారులు పరిశీలించి త్వరితగతిన పరిష్కారాలు చూపాలన్నారు. దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. గత వారం వరకు 18,360 అర్జీలు రాగా, 17,752 అర్జీలను పరిష్కరించినట్లు తెలిపారు. 608 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవో రంగనాథ్ రావు, డీఆర్‌డీవో సురేందర్, జెడ్పీ సీఈవో చందర్, డీపీవో శ్రీనివాస్ రావు, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లకు పట్టాలు ఇవ్వలేదు

డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించిన అధికారులు రెండున్నరేళ్లుగా పట్టాలు ఇవ్వడం లేదంటూ భిక్కనూర్ మండలం జంగంపల్లికి చెందిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారులు కలెక్టరేట్‌కు తరలివచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో 50 ఇళ్లు నిర్మించి తమకు కేటాయించారని తెలిపారు. కానీ ఇప్పటికీ ఇళ్ల పట్టాలు ఇవ్వలేదన్నారు. ఇతర పనులకు పట్టాల అవసరం ఏర్పడుతున్నాయిని అన్నారు. ఉన్నతాధికారులు స్పందించి పట్టాలు ఇప్పించాలని ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి



సదాశివనగర్‌లో హాజరైన అధికారులు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): గ్రామాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించేలా కృషి చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సూచించారు. సోమవారం తహసీల్ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించారు. కార్యక్రమంలో పలు సమస్యలపై చర్చించినట్లు తహసీల్దార్ గంగాసాగర్ తెలిపారు. ఎంపీవో సురేందర్ రెడ్డి, ఏవో ప్రజాపతి, సీహెచ్‌వో నాగరాజు, ఏపీవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎలాంటి ఫిర్యాదులు అందలేదు



రాజంపేటలో ప్రజావాణికి హాజరైన అధికారులు

రాజంపేట: స్థానిక తహసీల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి ఎలాంటి ఫిర్యాదులు రాలేదని తహసీల్దార్ అనిల్ కుమార్ తెలిపారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీవో రాజేష్, ఎంపీవో రఘురాం, ఎంఈవో పూర్ణచంద్రరావు, ఇంచార్జ్ మండల వ్యవసాయ అధికారి రాధ, మిషన్ భగీరథ ఏఈ రజిత, సెర్ప్ ఏపీఎం సాయిలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పేదలకు వరం సీఎం రిలీఫ్ ఫండ్

- ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి



బాన్సువాడలో చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పోచారం, పక్కన కాసుల బాల్‌రాజ్

బాన్సువాడ: సీఎం సహాయ నిధి పథకం పేద ప్రజలకు వరంలా మారిందని వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం బాన్సువాడలో ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌తో కలిసి నియోజకవర్గంలోని 104 మంది లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. ప్రస్తుతం నియోజకవర్గంలో 104 మంది లబ్ధిదారులకు రూ.28.26 లక్షల పైచిలుకు మంజూరయ్యాయని తెలిపారు. మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, నాయకులు ఖలేక్, మోహన్ నాయక్, నార్ల సురేష్, శశికాంత్, తదితరులున్నారు.

అయ్యప్పస్వాముల పాదయాత్ర ప్రారంభం

బాన్సువాడ: బాన్సువాడకు చెందిన అయ్యప్ప స్వాములు శబరిమలైకి పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. అయ్యప్ప ఆలయం నుంచి స్వాముల పాదయాత్రను ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా గురుస్వామి గురు వినయ్ మాట్లాడుతూ.. బాన్సువాడ, బీర్కూర్ మండలాల నుంచి 60 మంది అయ్యప్ప మాలధారణ స్వాములు పాదయాత్రగా వెళ్లినట్లు తెలిపారు.

‘కలెక్టర్ అవమానపరిచారు’



కలెక్టరేట్ డోర్‌కు వినతిపత్రాన్ని కడుతున్న నేతలు

కామారెడ్డి టౌన్: ప్రజావాణి కార్యక్రమంలో వినతి పత్రం అందజేయడానికి వెళ్తే కలెక్టర్ తమను అవమానించారని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ ఆరోపించారు. సోమవారం వినతిపత్రాన్ని ప్రజావాణి కార్యక్రమంలో అధికారులకు అందజేయకుండా కలెక్టరేట్ కార్యాలయం డోరుకు దారంతో కట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ప్రజావాణి కార్యక్రమం జరుగుతున్న సమావేశపు హాల్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తుండగా దూరంగా ఉండి మాట్లాడాలని, సెక్యూరిటీతో కిందికి దింపేయించి అవమానపరిచారని అన్నారు. ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శికి ఫిర్యాదు చేస్తామన్నారు. జిల్లాలో లింగ నిర్ధారణ చేస్తూ ప్రోత్సహిస్తున్న స్కానింగ్ సెంటర్లు, ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా నాయకుడు వెంకటిగౌడ్ ఉన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలను చాలెంజ్‌గా తీసుకోవాలి



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలను కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు చాలెంజ్‌గా తీసుకోవాలని నాగిరెడ్డిపేట కాంగ్రెస అధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్ సూచించారు. ధర్మారెడ్డిలో సోమవారం మండల కమిటీ, కో–ఆర్డినేషన్ కమిటీ సభ్యులతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి సీటు హస్తగతమయ్యేలా కమిటీ సభ్యులు పని చేయాలన్నారు. దీంతోపాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బోపేతానికి కృషి చేయాలన్నారు. కాంగ్రెస క్రమశిక్షణ కమిటీ సభ్యులు రాంచందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కిష్టయ్య, నాయకులు ఇమామ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఏజెంట్లకు పాత కమీషన్ అమలు చేయాలి



కామారెడ్డి అర్బన్: ఎల్ఐసీ ఏజెంట్లకు పాత కమీషన్ రేట్లను అమలు చేయాలని, పాలసీదారులకు బోనస్ పెంపు, కనీస పాలసీ బీమాను లక్ష రూపాయలుగా ఉంచాలని, సరెండర్ చేస్తే కమీషన్ రికవరీ చేసే పద్ధతిని ఎత్తివేయాలని, పాలసీ ప్రీమియంపై జీఎస్టీ ఎత్తి వేయాలని డిమాండ్ చేస్తూ భారతీయ జీవిత బీమా ఏజెంట్ల సమాఖ్య(లియాఫీ) ఆధ్వర్యంలో ఏజెంట్లు ఎల్ఐసీ కామారెడ్డి శాఖ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా లియాఫీ సికింద్రాబాద్ డివిజన్ ఉపాధ్యక్షుడు టి.మోహన్‌తో పాటు బ్రాంచ్ నాయకులు కదం నారాయణరావు, ప్రదీప్ కుమార్ జైన్, వి.రాజారెడ్డి, తదితరులు మాట్లాడారు. ప్రయివేట్ బీమా కంపెనీలు ఐఆర్‌డీఏఐని అడ్డం పెట్టుకుని ఎల్ఐసీకి అన్యాయం చేయాలని చూస్తున్నాయని ఆరోపించారు.

టీజీఈజేఏసీ జిల్లా స్టీరింగ్ కమిటీ ఏర్పాటు



జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు

కామారెడ్డి టౌన్: తెలంగాణ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ(టీజీఈజేఏసీ) జిల్లా స్టీరింగ్ కమిటీని రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని పెన్షనర్ భవనంతో ఏర్పాటు చేశారు. జిల్లా చైర్మన్‌గా ఎన్.వెంకట్ రెడ్డి, సెక్రటరీ జనరల్‌గా డాక్టర్ దేవేందర్, అడిషనల్ సెక్రటరీ జనరల్‌గా కుశాల్, కో–చైర్మన్‌లుగా సీహెచ్. అనిల్ కుమార్, సాయిలు, బి.ప్రేమ్ కుమార్, హనుమంత్ రెడ్డి, బి.రాజు, ముజీబుద్దీన్, డాక్టర్ నిజాం, బి.దేవులా, నిట్టు విఠల్‌రావు, డిప్యూటీ సెక్రటరీ జనరల్‌గా బి.సాయిలు, బి.సాయి రెడ్డి, కె.ఎల్లారెడ్డి, వైస్ చైర్మన్‌గా బి.పూర్ణచందర్, ఎండీ. బషీర్, అంబీర్ మనోహర్ రావు, ఫైనాన్స్ సెక్రటరీగా ఎం.చక్రధర్, పబ్లిసిటీ సెక్రటరీగా ఎస్. భూమయ్యలు ఎన్నికయ్యారు. ఈ మెరకు నూతన కమిటీ సభ్యులు మాట్లాడారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పలు తీర్మానాలు చేశారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



భిక్కనూరు: పరిశోధన ఆవిష్కరణలు– భారతదేశం అనే అంశంపై నవంబర్ 8, 9 తేదీల్లో జేఎన్‌టీయూ(హైదరాబాద్)లో నిర్వహించే పరిశోధన వర్క్‌షాపునకు సంబంధించిన వాల్‌పోస్టర్లను సౌత్ క్యాంపస్‌లో సోమవారం ఆవిష్కరించారు. తెలంగాణ విశ్వవిద్యాలయం కన్వీనర్ గౌతం, ప్రిన్సిపాల్ సుధాకర్‌గౌడ్, అధ్యాపకులు ప్రతిజ్ఞ, మోహన్ బాబు, లలిత, హరిత, సబిత, అంజయ్య నారాయణ గుప్తా, వైశాలి, శ్రీమాత, రమాదేవి, ఇంద్రకరణ్‌రెడ్డి పాల్గొన్నారు.

‘ఓలా’పై కస్టమర్ల దాడి

ఖలీల్‌వాడి: ఓలా విద్యుత్ బైక్ సంస్థపై కస్టమర్లు దాడికి పాల్పడిన ఘటన నగరంలోని వినాయక్‌నగర్‌లో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ఓలా బైక్‌లు తరచూ రిపేర్‌కు గురవుతున్నాయని కస్టమర్లు షోరూంలో ఇవ్వడానికి వచ్చారు. ఈ క్రమంలో కస్టమర్లు, సిబ్బంది మధ్య వాగ్వావాదం చోటు చేసుకుంది. దీంతో కస్టమర్లు షోరూం అద్దాలను ధ్వంసం చేశారు. అక్కడికి వచ్చిన పోలీసులు మద్యం మత్తులో ఈ తతంగం జరిగినట్లు గుర్తించారు. షోరూం నిర్వాహకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



మాచారెడ్డి: అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు పాల్వంచ మండలం ఇసాయిపేట శివారులో చెట్టుకు సోమవారం రాత్రి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. మాచారెడ్డి మండల కేంద్రానికి చెందిన దువ్వల బాలకృష్ణ(32) తన సొంత ఆటోతో పాల వ్యాపారం చేస్తూ జీవిస్తున్నాడు. రోజు మాదిరిగానే మాచారెడ్డి నుంచి ఇసాయిపేట అక్కడి నుంచి అక్కాపూర్ వెళ్లే క్రమంలో గ్రామ శివారులోని ఓ చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించారు. కాగా మృతుడి ఒంటిపై కొట్టిన గాయాలున్నాయని, కచ్చితంగా హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించారని కుటుంబ సభ్యులు ఆరోపించారు. బాలకృష్ణ ఆత్మహత్య చేసుకునేంత పిరికి వాడు కాదని గ్రామస్తులు, కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేశారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఘటనా స్థలానికి కామారెడ్డి రూరల్ సీఐ రామన్, మాచారెడ్డి ఎస్సై అనిల్ చేరుకొని కేసు దర్యాప్తు చేస్తున్నారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్తో గాలింపు చర్యలు చేపట్టారు.

తెరుచుకున్న మాధవనగర్ రైల్వేగేట్



నిజామాబాద్ రూరల్: మండలంలోని మాధవనగర్ రైల్వేగేట్ మూడు రోజులుగా మూసి ఉన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మూడు రోజుల పాటు రైల్వే అధికారుల ఆధ్వర్యంలో కార్మికులు ట్రాక్ పునరుద్ధరణ, రోడ్డు మరమ్మత్తులు చేపట్టారు. ఈ నెల 25 నుంచి 27 అర్ధరాత్రి వరకు రైల్వేగేట్ మూసి ఉంది. పనులు పూర్తికావడంతో సోమవారం ఉదయం నుంచి రాకపోకలు ప్రారంభమయ్యాయి.

క్రైం కార్నర్

అప్పిచ్చిన డబ్బులు అడిగితే కత్తితో దాడి

ఖలీల్‌వాడి: అప్పుగా ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వాలని అడిగిన వ్యక్తిపై సదరు వ్యక్తి కత్తితో దాడి చేసిన ఘటన నగరంలోని దుబ్బ ప్రాంతంలో సోమవారం ఉదయం చోటు చేసుకుంది. మూడో టౌన్ ఎస్సై మహేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. దుబ్బ ప్రాంతానికి చెందిన విశ్వనాథ్ అలియాస్ ఈశ్వర్ వద్ద భాస్కర్ అనే వ్యక్తి రూ.5 వేలు అప్పుగా తీసుకున్నాడు. తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వాలని భాస్కర్‌ను విశ్వనాథ్ అడుగగా, అతడిపై కక్షపెంచుకున్న భాస్కర్ ఉదయం కత్తితో విచక్షణారహితంగా దాడి చేసి మూడో టౌన్ పీఎస్‌లో లొంగిపోయాడు. స్థానికులు బాధితుడు విశ్వనాథ్‌ను జీజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం




బాల్కొండ: రోడ్డుపై వెళ్తున్న లారీని వెనుక నుంచి మరో లారీ వేగంగా ఢీకొన్న ఘటనలో ఓ లారీ డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన ఘటన ముప్కాల్ మండలం వేంపల్లి శివారులో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ముప్కాల్ ఎస్సై రజనీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్మూర్ నుంచి నిర్మల్ వైపు వెళ్తున్న లారీ జాతీయ రహదారిపై ఒక్క సారిగా ముందున్న వాహనాన్ని వేగంగా ఢీకొన్నది. ఈ ఘటనలో వెనుక వాహనంలో ఉన్న హర్యానకు చెందిన డ్రైవర్ సక్కం అలీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయి తీవ్రగాయాల పాలయ్యాడు. సుమారు రెండు గంటల పాటు పోలీసులు, తోటి డ్రైవర్లు శ్రమించి అతన్ని బయటకు తీశారు. డ్రైవర్ కాలు విరిగడంతో హైవే అంబులెన్స్‌లో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

బైక్‌ను ఢీకొన్న కారు.. ఒకరి మృతి

మోర్తాడ్: బైక్‌ను కారు ఢీకొన్న ఘటనలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన ఏర్గట్ల శివారులో సోమవారం చోటు చేసుకుంది. ఏఎస్సై లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏర్గట్లకు చెందిన నాగులు(45) పని నిమిత్తం బైక్‌పై బయటకు వెళ్లి తిరిగి వస్తుండగా బట్టపూర్ నుంచి ఏర్గట్ల వైపు వస్తున్న కారు ఏర్గట్ల శివారులో ఢీకొన్నది. ఈ ఘటనలో నాగులుకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ఆస్పత్రికి తరలించినట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

కూనిపూర్‌లో చిరుత సంచారం



వర్ని: మండలంలోని కూనిపూర్ అటవీ ప్రాంతంలో చిరుత సంచరిస్తున్న ఆన వాళ్లను గుర్తించినట్లు గ్రామస్తులు తెలిపారు. సోమవారం ఉదయం వ్యవసాయ పనుల నిమిత్తం పొలాల్లోకి వెళ్తున్న రైతులకు గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో చిరుత పాదముద్రలు గుర్తించారు. వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. మండలంలోని అన్ని అటవీ ప్రాంతాల్లో చిరుతల సంచారం ఉన్నందున ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని, రాత్రి సమయాల్లో అటవీ ప్రాంతాల్లోకి వెళ్లొద్దని అటవీశాఖ అధికారులు సూచించారు.

ఎల్లమ్మగుట్టలో చోరీ

ఖలీల్‌వాడి: నగరంలోని ఎల్లమ్మగుట్ట సోని ఫంక్షన్ హాల్ ఎదుట ఉన్న రాములు ఇంట్లో చోరీ జరిగినట్లు ఎస్సై శ్రీకాంత్ సోమవారం తెలిపారు. రాములు నాలుగు రోజుల క్రితం కుటుంబ సభ్యులతో కలిసి కామారెడ్డికి వెళ్లారు. తిరిగి వచ్చేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఇంట్లో ఉన్న 7 తులాల బంగారం, రూ. 20 వేల నగదు దొంగతనం జరిగినట్లు బాధితులు తెలిపారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి



రత్నయ్య(ఫైల్)

నాగిరెడ్డిపేట: జీవితంపై విరక్తితో పురుగుల మందు సేవించిన ఓ వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన నాగిరెడ్డిపేట మండలంలోని మాల్తుమ్మెద గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై మల్లారెడ్డి సోమవారం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వదల్‌పర్తి రత్నయ్య(61) గత మూడేళ్లుగా ఇంటి వద్దే ఉంటున్నాడు. అతని భార్య పద్మ కూలీ పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. ఈ క్రమంలో ఆదివారం పద్మ కూలీపనికి వెళ్లి వచ్చేసరికి రత్నయ్య ఇంటిముందున్న అరుగుపై పడుకున్నాడు. ఎంతకీ లేవకపోవడంతో పురుగులమందు సేవించినట్లు గుర్తించి చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. బాధిత కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

అనారోగ్యంతో మరొకరు..

బోధన్‌రూరల్: మండలంలోని చిన్న మావంది గ్రామానికి చెందిన గైని సాయి కుమార్ (26) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్ రెడ్డి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. సాయి కుమార్ కొంతకాలంగా అనారోగ్యానికి గురి కాగా చికిత్స పొందుతున్నాడు. ఈ నెల 27న జిల్లా కేంద్రంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి గంగాధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మద్యానికి బానిసై ఒకరి ఆత్మహత్య

బోధన్‌రూరల్: మండలంలోని పెంటాఖుర్దు గ్రామానికి చెందిన గైని లక్ష్మణ్(28) మద్యానికి బానిసై ఆత్మహత్యకు పాల్పడినట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్‌రెడ్డి తెలిపారు. ఎస్సై సోమవారం తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మణ్ కొంతకాలంగా మద్యానికి బానిసై ఇంట్లో వారితో తరచూ గొడవలు పడుతుండేవాడు. ఈ క్రమంలో ఈ 27న ఇంట్లో వారితో గొడవపడి మద్యం మత్తులో అర్ధ రాత్రి ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కడుపునొప్పి భరించలేక యువకుడు..

ఎల్లారెడ్డిరూరల్: కడుపునొప్పి భరించలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఎల్లారెడ్డిమండలంలోని దావల్‌మల్కపల్లి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై మహేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. నిజాంసాగర్ మండలంలోని నర్వ గ్రామానికి చెందిన నీరుడి సతీశ్(35) తన అత్తగారిల్లు అయిన దావల్‌మల్కపల్లికి ఈనెల 27న వచ్చాడు. సోమవారం ఉదయం సతీశ్ కనిపించక పోవడంతో కుటుంబ సభ్యులు పలు చోట్ల గాలించారు. గ్రామ శివారులో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎల్లారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్సై మహేశ్ పేర్కొన్నారు.

మహిళ హత్యకేసులో ఒకరికి జీవిత ఖైదు

ఖలీల్‌వాడి: మహిళను అత్యాచారం చేసి, హత్య చేసిన కేసులో నిందితుడు మూడ్ వెంకట్ రావుకు జీవిత కారాగార శిక్షతో పాటు పదేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ నిజామాబాద్ స్పెషల్ సెషన్స్ జడ్జి టి శ్రీనివాస్ సోమవారం తీర్పు వెలువరించారు. వివరాలు ఇలా ఉన్నాయి. వర్ని మండలంలోని రాజీపేట్ తండాకు చెందిన వెంకట్‌రావు ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. 2019ఫిబ్రవరి23న వర్నిలో కల్లు తాగేందుకు కల్లు దుకాణానికి వెళ్లాడు. అక్కడ ఓ మహిళ పరిచయం కాగా ఆమెతో కల్లు తాగాడు. వీరు బయటకెళ్లి మద్యం సేవించాలని నిర్ణయించుకొని ఆటో ఎక్కారు.

రాజీపేట్ తండాకు వెళ్లేదారిలో గూండ్ల వాగులోకి వెళ్లి మద్యం సేవించి శారీరకంగా కలిశారు. అనంతరం మరోసారి శారీరకంగా కలుద్దామని వెంకట్‌రావు బలవంతం చేయగా ఆమె డబ్బులు డిమాండ్ చేసింది. దీంతో కోపంలో ఆమెను కిందికి నెట్టేయడంతో కేకలు వేసింది. ఎవరైనా చూస్తారనే భయంతో ఆమె గొంతు నులిమి హత్య చేశాడు. బాధిత కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయడంతో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. విచారణలో నేరం నిర్ధారణ కావడంతో ఇండియన్ పీనల్ కోడ్ సెక్షన్ 302 హత్య నేరానికిగాను జీవిత కారాగార శిక్షతో పాటు రూ. వెయ్యి జరిమానా విధించారు. అంతేకాకుండా సెక్షన్ 376 అత్యాచారం నేరానికి పదేళ్ల కారాగార శిక్షతో పాటు రూ. వెయ్యి జరిమానా విధించారు. జరిమానాలు చెల్లించకుంటే అదనంగా రెండు నెలల జైలుశిక్ష అనుభవించాలని స్పెషల్ సెషన్స్ జడ్జి శ్రీనివాస్ తీర్పులో పేర్కొన్నారు.

తమ్ముడిపై హత్యాయత్నం.. అన్నకు మూడేళ్ల జైలు

ఖలీల్‌వాడి: తమ్ముడిపై హత్యాయత్నం చేసిన అన్నకు మూడేళ్ల జైలుశిక్ష విధిస్తూ నిజామాబాద్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి శ్రీకాంత్ బాబు సోమవారం తీర్పు వెలువరించారు. డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ లక్ష్మీనర్సయ్య తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని నాందేవ్‌వాడకు చెందిన దుప్పల హనుమంతు, దుప్పల భీమ్‌రావు అన్నాదమ్ముళ్లు. మద్యానికి బానిసైన అన్న హనుమంతు ప్రతిరోజు మద్యం కోసం భీమ్‌రావు ఇంటికి వెళ్లి డబ్బులు అడిగేవాడు. 2023నవంబర్15న హనుమంతు డబ్బులు కావాలని అడిగితే భీమ్‌రావు లేవని చెప్పడంతో కత్తెరతో అన్న తన తమ్ముడి కడుపులో పొడిచాడు. దీంతో కేసు నమోదైంది. విచారణలో నేరం రుజువు కావడంతో జడ్జి శ్రీకాంత్ బాబు నిందితుడికి మూడేళ్ల జైలుశిక్ష విధించారు.

వృద్ధురాలి అదృశ్యం

నవీపేట: మండలంలోని మోకన్‌పల్లి గ్రామానికి చెందిన తాల్లె ముత్తెమ్మ అనే వృద్ధురాలు అదృశ్యమైనట్లు ఎస్సై వినయ్ సోమవారం తెలిపారు. మతిస్థిమితం లేని వృద్ధురాలు ఈనెల 26న ఇంటి నుంచి ఉదయం బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు పలు చోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. కుమారుడు గంగారాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

తల్లి, ఇద్దరు పిల్లలు..

నవీపేట: మండలంలోని ఓ గ్రామానికి చెందిన వివాహిత తన ఇద్దరి పిల్లలతో కలిసి అదృశ్యమైనట్లు ఎస్సై వినయ్ తెలిపారు. సోమవారం ఉదయం ఇంట్లో ఉన్న తన భార్య కుమారుడు, కుమార్తె సాయంత్రం ఇంటికి వచ్చే సరికి లేరని భర్త తెలిపాడు. దీంతో కుటుంబీకులు బంధువులు, పలు చోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

తోపుడు బండ్లకు అగ్నిప్రమాదం



ఖలీల్‌వాడి: నగరంలోని శివాజీనగర్‌లో ఉన్న శంకర్ భవన్ స్కూల్ ఎదుట రెండు తోపుడు బండ్లకు అగ్ని ప్రమాదం జరిగినట్లు రెండో టౌన్ ఎస్సై యాసిన్ ఆరాఫత్ సోమవారం తెలిపారు. దుండగులు విద్యుత్ హైటెన్షన్ వైర్లతో బండ్లకు నిప్పు పెట్టి ఉంటారని బాధితుడు హైమ్మద్ చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

మారుతినగర్‌లో చోరీ

నిజామాబాద్ రూరల్: రూరల్ పీఎస్ పరిధిలోని మారుతినగర్‌లో ఉన్న శివరాం ఇంట్లో చోరీ జరిగినట్లు రూరల్ ఎస్‌హెచ్‌వో ఆరిఫ్ సోమవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. శివరాం ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి కామారెడ్డికి వెళ్లాడు. రాత్రి ఇంటికి వచ్చే సరికి చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. నాలుగు తులాల బంగారం, రూ.50వేల నగదు దొంగతనం జరిగినట్లు గుర్తించి బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

ఏటీఎంలో చోరీకి యత్నం

ఆర్మూర్ టౌన్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి చౌరస్తాలో ఉన్న పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఏటీఎంలో దుండగులు ఆదివారం అర్ధరాత్రి చోరీకి యత్నించారు. దుండగులు ఏటీఎంలోకి చొరబడి కేబుల్ వైర్లను కట్ చేసినట్లు బ్యాంక్ మేనేజర్ సత్యనారాయణ తెలిపారు. చోరీ విషయమై మేనేజర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.